జిందగీ
చిరత్రేణ
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 3 ఫిబ్రవరి 2025
www.ntnews.com
11

మహాభారత యుద్ధం జరిగింది దక్షిణాయనంలో. ఉత్తరాయణంలో మరణించిన వారికి ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయని శాస్త్రవచనం. అందువల్ల దక్షిణాయనంలో శరతల్ప గతుడైన భీష్ముడు ఇచ్ఛామరణ వరప్రసాదుడు. కాబట్టి, ఉత్తరాయణం ప్రవేశించే వరకు 58 రోజులు వేచి చూసి మాఘ శుక్ల అష్టమి నాడు యోగ విశేషంతో సమాధిలోకి వెళ్లాడు. శ్రీకృష్ణుడి అనుగ్రహంతో దేహ త్యాగం చేసి పరలోక గతుడై తన పూర్వరూప మైన వసువులలో కలిసి పోయాడు. అందుకే దీనికి భీష్మాష్టమి అనే పేరు వచ్చింది.

మహిమాన్వితం భీష్మ చరితం

బుధవారం భీష్మాష్టమి

వసిష్ఠ మహర్షి శాపానికి గురైన అష్ట వసువులలో చివరి వాడైన ప్రభాసుడు ఈ లోకంలో గంగా శంతనుల కుమారుడిగా భీష్ముడు జన్మించాడు. ఆయన అసలుపేరు దేవవ్రతుడు. తర్వాత కాలంలో కారణాంతరాల వల్ల గంగ వెళ్లిపోతుంది. దీంతో శంతనుడు సత్యవతిని వివాహం చేసుకోవాలనుకుంటాడు. అప్పుడు, సత్యవతి తండ్రి షరతుల మేరకు తాను వివాహం చేసుకోనని, ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండిపోతానని దేవవ్రతుడు భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు. అలా ఆయన 'భీష్ముడు'గా ప్రసిద్ధిచెందాడు. కుమారుడి త్యాగానికి శంతనుడు సంతోషిస్తాడు. తాను కోరుకున్నప్పుడు మరణం సంభవించగల వరాన్ని అనుగ్రహిస్తాడు. ఈ కారణంగానే భీష్ముడు మాఘ శుక్ల అష్టమి రోజు ప్రాణాలు వదిలిపెట్టాడు. అందువల్ల ఈ తిథిని పరమ పవిత్రమైనదిగా భావిస్తారు.

పద్దెనిమిది పర్వాలు గల మహాభారతంలో శాంతి, అనుశాసనిక పర్వాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. కురుక్షేత్ర సంగ్రామం జరుగుతున్న పదోనాడు తనను ఎలా ఓడించాలో భీష్ముడు స్వయంగా ధర్మరాజుకు తెలుపుతాడు. మర్నాడు అర్జునుడి బాణాలకు గాయపడి అంపశయ్యపై ఉండిపోతాడు. ఉత్తరాయణ ఆగమనానికి నిరీక్షిస్తూ ఉంటాడు. అదే సమయంలో యుద్ధంలో బంధువులను, జ్ఞాతులను కోల్పోయి వైరాగ్యంతో ఉన్న ధర్మరాజు, తనకు రక్తపు కూడు వంటి ఈ రాజ్య పరిపాలన వద్దని, తాను అడవులకు వెళ్లి తపస్సుతో పాపప్రక్షాళన చేసుకుంటానని శ్రీకృష్ణాదులకు వెల్లడిస్తాడు. అందుకు వారంతా ఆయనను నివారించి పట్టాభిషిక్తుణ్ని చేస్తారు. అప్పుడు తన పాలనకు అవసరమైన ధర్మమార్గాలను ఉపదేశించాల్సిందిగా శ్రీకృష్ణుడు, మహర్షులు మొదలైన వారిని ధర్మజుడు కోరతాడు. అందుకు తగిన వ్యక్తి భీష్ముడేనని శ్రీకృష్ణుడు నిశ్చయించుకుంటాడు. ఓఘవతీ నదీ తీరంలో అంపశయ్యపై ఉన్న భీష్ముని దగ్గరికి ధర్మజాదులను తీసుకువెళ్తాడు. పితామహుడు వారితో చేసిన ఉపదేశమంతా ఈ రెండు పర్వాలలోనే ఉన్నది.

తాత గారైన భీష్ముడు ఈ స్థితిలో ఉండటానికి కారణం తానేననే భయంతో ఆయన దగ్గరికి వెళ్లడానికి ధర్మరాజు వణికిపోయాడు. అప్పుడు ధర్మరాజుకు స్వయంగా భీష్ముడే ధైర్యవచనాలు చెబుతాడు. ధర్మద్రోహుల పక్షం వహించిన తనలాంటి వారందరికి శిక్షపడవలసిందేనని, అధర్మం వైపు నిలిచిన వారికి పరిపాలకుడు సరియైన శిక్షలు విధించాలని ప్రబోధిస్తాడు. ప్రజలు ఆచరించ వలసిన ధర్మాలు, సాంఖ్యాది యోగాలు, పురాణేతిహాసాలు, ధర్మశాస్త్ర విషయాలు, లోక వ్యవహారాలు వంటి అంశాల గురించి ధర్మరాజు అడిగిన సుమారు 220 వరకు ప్రశ్నలకు పితామహుడు అనేక ఉపకథలతో సమాధానాలు ఇస్తాడు. ఈ సంభాషణ ముప్పై రోజులపాటు సాగుతుంది. మహిమాన్వితమైన శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం కూడా ఇందులో భాగం కావడం విశేషం.

భీష్ముడు పరమపదం పొందింది మాఘ శుక్ల అష్టమి అయినా, మాఘ శుక్ల ద్వాదశి వరకు ఉన్న ఐదు రోజులను 'భీష్మ పంచకం' అంటారు. వీటిలో ఏకాదశి శ్రేష్ఠమైంది. దీన్నే 'భీష్మ ఏకాదశి' అంటారు. ఈ రోజు భీష్ముని స్మరిస్తూ భారతీయులు ఆ మహనీయుడికి తర్పణాలు వదలడం సంప్రదాయం. ఈ ఏకాదశిని పుణ్యదినంగా భావించి ఆ మహాత్ముని భక్తిశ్రద్ధలతో స్మరించుకొంటారు. అంతేకాకుండా ఈ రోజును శ్రీవిష్ణు సహస్రనామ జయంతిగా కూడా ఆచరిస్తారు.

భీష్మ పంచకం

...✍ డా॥ కండ్లకుంట నరసింహమూర్తి
94401 60035

సరస్వతీ నమస్తుభ్యం!

వసంత పంచమి

చదువుల తల్లి పుట్టినరోజు వసంత పంచమి పర్వదినం. 'యా కుందేందు తుషార హార ధవళా, యా శుభ్ర వస్త్రాన్వితా..' అని మనం కొలుచుకున్నట్టు అమ్మవారు తెల్లటి వెన్నెలలా మెరిసే శుద్ధ సాత్విక రూపిణి. నిజానికి సరస్వతి అన్న పదానికి 'ప్రవహించే జ్ఞానం' అన్న అర్థం కూడా ఉంది. మాఘ శుక్ల పంచమి నాడు అమ్మవారిని కొలిస్తే అపారమైన జ్ఞాన సంపదను ప్రసాదంగా ఇస్తుందని పురాణాలు చెబుతున్నాయి. వేదవాఙ్మయంలో ఎన్నో సరస్వతీ ప్రార్థనలున్నాయి. రుగ్వేదం రకరకాల సరస్వతీ సూక్తాలను పొందుపరిచింది. అసలు వేదాలే సరస్వతీ మాత నుంచి వెలువడ్డాయని 'గాయత్రీ హృదయం' చెబుతుంది. అందుకే అప్పుడే అక్షరాలు దిద్దుకుంటున్న బిడ్డలకు వసంత పంచమి నాడు అక్షరాభ్యాసం చేయించే ఆనవాయితీ ఉంది. తల్లీ నిన్ను దలంచి.. అంటూ అమ్మకు మొక్కి పలక పట్టించడం మన దగ్గరి విశిష్ట సంప్రదాయం.

వసంత మాస ఆగమనాన్ని సూచించేదిగా మాఘ శుక్ల పంచమిని వసంత పంచమిగా కూడా జరుపుకొంటారు. దీనికే సరస్వతీ జయంతి, శ్రీ పంచమి అన్న పేర్లూ ఉన్నాయి. ఈ సమయంలో అటు చలికాలమూ కాకుండా ఇటు ఎండాకాలమూ కాకుండా హాయిగొలిపే వాతావరణం ఉంటుంది. అంతేకాదు, లేలేత చిగుళ్లు, అందమైన పూలు ఈ కాలపు ప్రత్యేకతలు. అందుకే దీన్ని మదన పంచమి అని కూడా పిలుస్తారు. ఈ రోజు రతీమన్మథుల్ని పూజిస్తారు. ఉత్తరాదిలో ఈ రోజు రంగులు చల్లుకుని ఆడిపాడే సంప్రదాయమూ ఉంది. వసంతం అంటేనే సంతసాన్ని పంచేది. దానికి ఆహ్వానం పలికే ఈ రోజు ఆనందానికి మహాద్వారం లాంటిది. అమ్మ కృప కలిగితే అపార జ్ఞానానికి ఆది అడుగూ ఇదే!

...✍ శ్రీ

మౌనం గొప్పతనం



సంభాషణలే మన ఆలోచనలను తీర్చిదిద్దుతాయి. అయితే, మనకు తెలియని ప్రపంచం మౌనంలో, నిశ్శబ్దంలో ఉందనే సంగతిని మనం గమనించం. ఇక మౌనం అంటే మాట్లాడకుండా ఉండటం అనుకుంటారు. కానీ, అది నిజం కాదు. మౌనం అనేది మనల్ని మన మనసులో గూడుకట్టుకుపోయిన భావాలను గమనించేలా చేస్తుంది. అలా మన ఆలోచనల్ని పరిశీలిస్తున్న కొద్దీ అవి మన భావోద్వేగాల్ని ఎలా ప్రేరేపిస్తున్నాయో, మన ప్రవర్తనను ఎలా నడిపిస్తున్నాయో తెలుస్తుంది. మన అంతరంగంలోకి మనం తొంగిచూసుకుంటే లోతుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికివస్తుంది. మౌనం ద్వారానే మన చెవులు వినలేని దానిని మనం వినగలుగుతాం. కాబట్టి, కేవలం మాట్లాడకపోవడమే మౌనం కాదు. మన అంతరంగాన్ని వినడం అలవాటు చేసుకుంటే మౌనం గొప్పతనం నెమ్మదిగా అర్థమవుతుంది. అది మనల్ని విశ్వ సందేశాన్ని వినేలా చేస్తుంది.



అసుర భంజనం అమర రంజనం

మన పోతన 195 మధురిమ వ భాగం

శుక ఉవాచ- పరీక్షిన్మహారాజా! ఒకనాడు అరిష్టుడు (మూర్తీభవించిన అశుభం, ఉపద్రవం) అనే అసురుడు అచ్యుతు- కృష్ణునికి అరిష్టం కలిగించాలని వృషభ రూపం ధరించి, అహంకారంతో మహావేగంగా నందవ్రజం- మందపై అమాంతంగా విరుచుకుపడ్డాడు. గొల్లలూ, ఎద్దులూ, ఆవులూ, దూడలూ సర్వం చెల్లాచెదరు కావడం వల్లవ వీరుడు హరి పరికించాడు. తల్లడ పడి గొల్లలందరూ శౌరిని శరణు వేడారు. నందుపట్టి దానవుని కొమ్ములు పట్టి వానిని మట్టి కరిపించి, వాని కొమ్ము పీకి దానితోనే వాణ్ని చితకకొట్టాడు. అసురుడు పస చెడి ఉసురులు- ప్రాణాలు విడిచాడు. విబుధులు- వేల్పులు హరిపై విరివిగా విరుల వానలు కురిపించారు.

'వృషః, వృషభః' అనగా ఇహ- పర సర్వసుఖ ఫలాలను వర్షించే 'ధర్మం'. ఇక్కడ ధర్మంగా చలామణి అయ్యే అధర్మమే వృషభాసురుడు. ధర్మ ఆభాస, ధర్మంగా తోచే అధర్మం- మేక వన్నె పులి, పయోముఖ విష కుంభం! భగవద్, భక్తి విరుద్ధ ధర్మంలో అసురత్వం నివాసముంటుంది. బలరామకృష్ణులు నందగోకులం- బృందావనంలో భద్రంగా ఉన్నారని నారద మునీంద్రుని వలన విన్న, హింసకు మారుపేరైన కంసుడు దేవకీ వసుదేవులను ఇనుప సంకెళ్లతో బంధించాడు. రామకేశవులను హత మార్చడానికి కేశి అనే రేగాము- రాక్షసుని గోకులానికి పంపాడు. అనంతరం మంత్రులను, మావటివాండ్రను, చాణూర ముష్టికులనే దుష్టులైన మల్ల యోధులను పిలిపించి వారితో ఇలా పలికాడు...

క॥ 'పట్టణ జనములు సూతురు
దట్టంబుగ మల్లరంగ తల పార్శ్వములం
బెట్టింపుడు తమగంబులు
పుట్టింపుడు వీట మల్లు పోరను మాటన్'

'ఇష్ట సఖులారా! జెట్టిపోరు (మల్ల యుద్ధం) ఏర్పాటు చేయండి. మల్ల రంగానికి నాలుగు దిక్కులా గట్టి మంచెలు కట్టించండి. పట్టణ ప్రజలు వచ్చి తిలకిస్తారు. నగరం నాలుగు మూలలా ఈ మాటను చాటండి. దిట్టలైన చాణూర ముష్టికులారా! మీరు జెట్టిపోరులో జగజెట్టులన్న పేరు గన్నవారు. అన్నలూ! మల్లయుద్ధంలో గొల్ల సోదరులను- రామకృష్ణులను మట్టుబెట్టి నాకు గట్టిగా ప్రీతిపాత్రులు కండి. ఓ మావటీ! మల్లరంగ ప్రవేశ ద్వారం వద్దనే కువలయాపీడ మదగజాన్ని అదలించి- ఉసిగొలిపి పసివారి మీదకు వదలిపెట్టు. చతుర్దశి నాడు విజయం కొరకు వైభవోపేతంగా ధనుర్యాగం చెయ్యాలి. పశుపతి- రుద్రునికి ప్రీతిగా పశు విశసనాలు- జంతుబలులు గావించండి.' రాజా! ఇలా తన వారినందరినీ ఆయా పనులకు పురికొల్పి కంసుడు, యాదవులలో ఉత్తముడైన అక్రూరుని రప్పించి, చేయి పట్టుకొని ఇలా అర్థించాడు.

శా॥ 'అక్రూరత్వము తోడ నీవు మనగా నక్రూర నామంబు ని
ర్వక్రత్వంబున జెల్లె మైత్రి సలుపన్ వచ్చున్ నినుం జేరి నీ
వక్రోధుండవు మందలోన బలకృష్ణాభీరు లస్మద్వినా
శ క్రీడారతులై చరింతురట యోజం దెచ్చి యొప్పింపవే!'

'మహాత్మా! క్రూరకృత్యాలకు పాలుపడకుండా మనుగడ సాగించడం వలన 'అక్రూరుడు' అనే అన్వర్థ- సార్థక నామం నీకు చక్కగా అమరింది. నీవు మిక్కిలి స్నేహా- నెయ్యానికి పాత్రుడవు. కినుక- కోపం లేనివాడవు. నందగోకులంలో రామకృష్ణులు నాతో కయ్యానికి కాలు దువ్వడానికి ఓ అయ్యా! సిద్ధమవుతున్నారట. ధనుర్యాగమనే నెపంతో నందాదులైన పెద్దలకు చెప్పి ఒప్పించి, వారిని తెచ్చి అప్పగించి నాకు ప్రాణాపాయం తప్పించు. అక్రూరా! పగవారి గుట్టు రట్టు చేయాలి. విరోధులను వృద్ధి కానీయ తగదు!' నృశంసు- క్రూరుడైన కంసుని పలుకులు విని అక్రూరుడు ఉక్రోష పడక- రోషం పొందక, నిర్వక్రంగా- వక్రత లేక సరళంగా ఇలా వక్కాణించాడు...

ఉ॥ 'పంపిన బోనివాడనె నృపాలక! మానవు లెన్న దమ్మునూ
హింపరు దైవ యోగముల నించుక గానరు తోచినట్లు ని
ష్కంపగతిం జరింతురది గాదన వచ్చునె? యీశ్వరేచ్ఛ ద
ప్పింపగ రాదు నీ పగతు బిడ్డల దెచ్చెద బోయి వచ్చెదన్'

మహారాజా! నీవు ఆదేశిస్తే నేను వెళ్లకుండా ఉండగలనా? వాస్తవంగా ఆలోచిస్తే... మానవులు తమ శక్తి ఎట్టిదో, దైవశక్తి ఎలాంటిదో ఇంచుక కూడా గ్రహించలేరు. తమ బుద్ధికి తోచినట్లుగా పట్టుదలతో ప్రవర్తిస్తుంటారు. కాదనడానికి వలను కాదు. విధి వ్రాత తప్పించడం ఎవరి తరమూ కాదు. నేను వెళ్లి నీ విరోధి పుత్రులను ఇక్కడికి తెప్పిస్తాను.'

'తన చావును తొలగించుకోడానికి కంసుడు ఇలా తలచడం సబబే. మానవుడు సిద్ధి, అసిద్ధులను, జయాపజయాలను సమంగా భావిస్తూ కర్తవ్యం నిర్వర్తించుకుంటూ పోవాలి. ఫలమిచ్చేది మన ప్రయత్నం కాదు, దైవం మాత్రమే. మనిషి కోరికల గాలిమేడలు కట్టుకుంటూ ఉంటాడు. ప్రారబ్ధం అనుకూలమై అభిలాష ఫలిస్తే ఆనందిస్తాడు. విఫలమైతే విషాదంలో మునిగిపోతాడు. అయినా నేను నీ ఆజ్ఞను శిరసావహిస్తా!' ఇదీ అక్రూరుని అంతరంగంలోని అంతర్మథనం!

శుకుడు... రాజా! ఇదిలా ఉండగా కంసుని పంపున 'కేశి' అను రక్కసుడు నందుని మందలో ప్రవేశించి అమంద- మిక్కిలి సంకటం కలిగించాడు.

క॥ 'భీషణ ఘోటక దానవ
హేషా నిర్ఘోష భిన్న హృదయ నిఖిల గో
యోషా పురుషార్థకమై
ఘోషము హరి సూడ దైన్య ఘోషం బయ్యెన్'

దారుణమైన అశ్వ- గుర్రపు ఆకారంలో ఉన్న ఆ అసురుని సకిలింత వినేసరికి మందలోని ఆవులు, దూడలు, ఆడ, మగ, బిడ్డలూ- అందరి హృదయాలూ కొందల- క్షోభ పడ్డాయి. గోవిందుడు చూస్తూండగానే ఆ ఘోష గోకులమంతా దీనంగా ఘోషించింది. అశ్వరూపంలో ఉన్న ఆ రక్కసుడు కర్కశంగా సకిలిస్తూ నింగినే మింగబోయే భంగి- విధంగా, నోరు పెద్దగా తెరచి పంకజాక్షుని కరవడానికి పొంకం- పొగరుగా ఉంకించాడు- పూనుకొన్నాడు. అండజవాహనుడు కృష్ణుడు దిగ్గజ తుండము వంటి తన చండ ప్రచండ బాహుదండాన్ని ఘోట నిశాటుని- గుర్రపు రాక్షసుని నోటిలోనికి చొనిపాడు- పొడిచాడు. గండైన- బలిష్ఠమగు వాని దేహం కర్కటికా ఫలం- దోసపండు లాగా రెండుగా చీలిపోయింది. ఇలా, జలజాతాక్షుడు బలరామానుజుడు కేశవుడు కేశిని అలవోకగా విలయం- అంతం గావించాడు.

కేశిని సంహరించి రమేశుడు కేశవుడుగా వాసికెక్కాడు. బ్రహ్మ, విష్ణు, ఈశ్వరులు- త్రిమూర్తులు ఎవనికి వశపడి ఉంటారో, వాడు కేశవుడని కూడా విశదమైన అర్థం. కేశి, హయగ్రీవ అసురుని అపర రూపం. వీడు వేద తస్కరుడు. 'నిగమ (వేద) తాత్పర్యం లోకానికి సుగమంగా తెలియనీయక మభ్యపెట్టి అగమ్య గోచరంగా- దాచి ఉంచేవాడు. వేదానికి పరమ తాత్పర్యం భగవంతుడు మరియు భక్తి! ప్రజం- గోకులం- ఇంద్రియ సమూహంలో వేదం పేరిట భక్తి విరుద్ధమైన ఖేద మూలక ఆసుర భావాన్ని విస్తరింప జేసే దాంభికుడే కేశి!' అని వ్యాఖ్యానం. శుకుడు- భూకాంతా! అంతలో నారాయణ భక్తి పరాయణుడైన నారద మహర్షి నందనందనుని సందర్శించి ఏకాంతంలో ఇలా విన్నవించాడు.. దేవా! రాజుల ఆకారాలు ధరించి ఉన్న రాక్షసులను ఖండించి ఈ భూమండలాన్ని రక్షించడానికి నీవు అవతరించావు. ఓ ప్రభూ! ఇకముందు చాణూర, ముష్టిక, కంస, శంఖచూడ, కాలయవన, నరక, మురు, పౌండ్రక, శిశుపాల, దంతవక్ర, సాల్వాదులు నీ చేతిలో సద్గతి చెందుతారు. దేవలోకం నుంచి, ఓ భక్త కల్పవృక్షమా! పారిజాత పాదపాన్ని పెకలించి తెస్తావు. నీవల్ల నృగునికి శాప విముక్తి ఒనగూరుతుంది. శమంతక మణిని స్వీకరిస్తావు. మృతులైన బ్రాహ్మణ పుత్రులను సజీవంగా తెచ్చి ఇవ్వగలవు. భారత సంగ్రామంలో అర్జునునికి సారథ్యం వహించి పెక్కు అక్షౌహిణుల సైన్యాన్ని ఉక్కడగించి- నశింపజేసి, ఎంచక్కా భూభారాన్ని తొలగిస్తావు.

శా॥ 'కృష్ణా! నీవొనరించు కార్యములు లెక్కింపన్ సమర్థుండె? వ
ర్ధిష్ణుండైన విధాత మూడు గుణముల్ దీపించు లోపించు రో
చిష్ణుత్వంబున నుండు నీ వలన; నిస్సీమంబు నీ రూపునిన్
విష్ణుం జిష్ణు సహిష్ణు నీశు నమితున్ విశ్వేశ్వరున్ మ్రొక్కెదన్'

'ఓ కృష్ణా! వర్ధిష్ణుడు- వర్ధన శీలుడైన విధాత- బ్రహ్మదేవుడు కూడా నీవు సాధించిన ఘన కార్యాలను లెక్కించడానికి ఒక్కింత కూడా సమర్థుడు కాడు. వల్లవ వీరా! నీ వల్లనే ఎల్లెడల సత్త్వ రజస్తమో గుణాలు పుట్టి, పెరిగి, గిట్టి పోతాయి. నీ రూపం అపురూపం, అపారం. నీవు విష్ణువవు- సర్వవ్యాపివి, జిష్ణవవు- సర్వత్ర, సర్వదా జయశీలివి, సహిష్ణువవు- సహనశీలివి, పరమేశ్వరుడవు, అమితుడవు- మితి (పరిమితి) లేనివాడవు. ప్రమాణ రహితుడవు కూడా! విశ్వేశ్వరుడవు- ప్రపంచ నియామకుడవు. శాసించువాడవు. ఓ నందపట్టీ! జగజెట్టివైన ఇట్టి నీకు వందనాలు!' ఇలా దేవదేవుని- మురహరుని పరిపరి విధాల కొనియాడి నారద ముని సెలవు గైకొని దేవలోకానికి మరలిపోయాడు.

తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

శుకుడు- రాజా! మరొక రోజున గోపబాలురు రామకృష్ణులతో కూడి వనంలో పశువులను మేపుతూ ఒక పర్వతం చెంత నిశ్చింతగా 'నిలాయన క్రీడ'- గంతలాట (దాగుడు మూతలు) ఆరంభించారు. అంతలో మయుడనే దానవుని జ్యేష్ఠ పుత్రుడు వ్యోమాసురుడు మాయ పూని గోపాలకుని రూపం ధరించి దొంగతనంగా ఆ దండులో జొరబడ్డాడు. 'చతుః పంచావశిష్టంగా'- నలుగురైదుగురిని తప్ప తక్కిన వారందరినీ ఒక్కొక్కరిగా ఆ కొండగుహలో చేర్చి ఒక పెద్ద బండతో ద్వారం మూసి అమాయకుని లాగా ఆ గండడు ఆటలో వచ్చి చేరాడు. అఖిల వేది- సర్వజ్ఞుడు, అసురభేది- దానవ మర్దనుడు, ఆది నారాయణుడు మాధవుడు నవ్వుతూ వ్యోమాసురునికి సమాధి కట్టాడు. భక్తికి విరుద్ధంగా, భగవద్ విశ్వాసాన్ని సడలిస్తూ జడలు విప్పి నాస్తికతకు ఊతమిచ్చే యోగ 'ఆభాస'- యోగం ముసుగులో భోగమే వ్యోమాసురుడు! వాసుదేవుని భాసురమైన కృప కలగనిదే ఈ ఆభాస- భ్రాంతి తొలగదు.

(సశేషం)

బంగారం-సింగారం

కథాసుధ

ఒక ఊళ్లో ఓ రైతు ఉండేవాడు. అతనికి వరి పొలం తోపాటు కొన్ని పూలతోటలు కూడా ఉండేవి. ఓ రోజు రైతు భార్య కనకాంబరం పూలు మూటగట్టి భర్త చేతికి ఇచ్చింది. పక్క ఊరిలో ప్రతి శనివారం జరిగే సంతలో వాటిని అమ్మాలని చెప్పింది. ఆ వచ్చిన డబ్బుతో బంగారం కన్నా సింగారమైనది కొనమని కోరింది. మిగిలిన డబ్బులను ఇంటికి తీసుకుని రమ్మంది. రైతు వెళ్లి సంతలో కనకాంబరాలను మంచి ధరకే అమ్మాడు. వచ్చిన డబ్బుతో బంగారం కన్నా సింగారమైనది కొనాలని సంత మొత్తం తిరిగాడు. అంగట్లో ఉన్నవాళ్లంద రినీ విచారించాడు. 'బంగారమే సింగారం. దాని కన్నా గొప్ప సింగారం ఎక్కడ ఉంటుంది?' అని అక్కడి అందరూ అతణ్ని ఎద్దేవా చేశారు. రైతుకు ఏం చేయాలో తోచలేదు. లేకలేక భార్య కోరిన కోరిక తీర్చలేకపోతున్నందుకు బాధేసింది. నేరుగా రాములవారి గుడికి వెళ్లాడు. వాడిన ముఖంతో గుడిమెట్ల మీద కూర్చున్నాడు. అక్కడ ఓ పండితుడు ప్రశాంతంగా కూర్చుని ఉన్నాడు. దిగులుగా ఉన్న రైతును చూసిన పండితుడు 'ఎందుకలా ఉన్నావు?' అని ప్రశ్నించాడు. రైతు ఆ పండితుడితో బాధగా 'నా భార్య తిక్కలది. అందుకే బంగారం కన్నా సింగారమైనది సంతలో కొనుక్కురమ్మని నన్ను కోరింది' అని చెప్పాడు. దానికి పండితుడు నవ్వి 'నీ భార్యకు కాదు తిక్క. నీకు! ఎందుకంటే ఆమె చెప్పిన దాంట్లో గూఢార్థం ఉంది. అది ఏమిటంటే, బంగారం కన్నా సింగారమైనది నుదుటి బొట్టు. సంతలో బొట్టు కొనుక్కురమ్మని నిన్ను కోరింది. అది తీసుకెళ్లి ఆమెకు ఇస్తే సరిపోతుంది' అని సలహా ఇచ్చాడు. 'అవును నిజమే..' అనుకున్న రైతు నేరుగా వెళ్లి అంగట్లో బొట్టు సీసా కొనుక్కుని ఇంటి దారి పట్టాడు.

...✍ ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

ఇస్లాం బోధ

ఖర్జూర వృక్షం ఆదర్శం

పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఓ చెట్టుతో పోల్చాడు అని చెబుతున్నది ఖురాన్. ఖర్జూర చెట్టు వేరు భూమిలోనికి లోతుగా నాటుకొని ఉంటుంది. కొమ్మలు ఆకాశాన్ని అంటుతాయి. ప్రభువు ఆదేశానుసారం అది విశేషంగా పండ్లను ఇస్తుందని ఖర్జూర చెట్టు గురించి ఖురాన్‌లో పేర్కొనడం విశేషం. ఒకసారి ప్రవక్త (స అసమ్) తన దగ్గరికి వచ్చిన ఇబ్నె ఉమర్(రజి)తో మాట్లాడుతూ 'ముస్లిం మాదిరిగా ఎల్లకాలం ఫలాలనిచ్చే వృక్షం ఏదో నాకు చెప్పండి' అని ప్రశ్నించాడు. ఉమర్ (రజి)కి 'ఖర్జూర చెట్టు' అయి ఉంటుందన్న ఆలోచన తట్టింది. కానీ, ఆ సమయంలో అక్కడ అబూబక్ర్(రజి), ఉమర్(రజి) వంటి ఉద్దండులు ఉపవిష్టులై ఉండటంతో సమాధానం చెప్పలేకపోయారు. పెద్దల ముందు మాట్లాడటం సబబు కాదని ఊరుకున్నాడు. వారెవరూ సమాధానం ఇవ్వకపోవడంతో ప్రవక్త (స) 'అది ఖర్జూర చెట్టు' అని చెప్పారు. సగటు ముస్లిమ్ (విశ్వాసి) ఖర్జూరపు చెట్టులాంటి వాడని ఎందుకన్నారంటే.. ఖర్జూరపు చెట్టు అన్ని కాలాల్లోనూ ఫలాలను ఇస్తుంది. అలాగే దైవ విశ్వాసి నిత్యం అందరి శ్రేయాన్ని కోరుకుంటాడని అర్థం. ఖర్జూరపు చెట్టు మొదలు నుంచి చివరి దాకా అన్నీ ఉపయోగపడేవే! ఖర్జూరపు కాయలు, పండ్లు, చెట్టు ఆకులు, దాని కలప, విత్తనాలు ఇలా అన్నీ పనికొచ్చేవే. ఖర్జూరపు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఎన్నో రోగాలకు ఔషధంగా పనిచేస్తాయి. ఖర్జూరం విత్తనాలు కూడా ఎన్నో రుగ్మతలకు విరుగుడుగా ఉపయోగపడతాయి. అలాగే దైవ విశ్వాసి తన జీవితాన్ని సమాజానికి, కుటుంబానికి అంకితం చేయాలని ప్రభువు యోచన. అందుకే, దైవ విశ్వాసిని ఖర్జూరంతో పోల్చారు ప్రవక్త (స).

...✍ ముహమ్మద్ ముజాహిద్,96406 22076